క్లుప్తంగా

నీటి మళ్లింపు ప్రారంభం

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి చింతమానుపల్లె ఎత్తిపోతల పథకానికి నీటి మళ్లింపును ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. వారు శుక్రవారం మండల పరిధిలోని నదీతీర గ్రామమైన సంగాలకు చేరుకుని నదికి గంగపూజ, మోటార్లకు పూజలు నిర్వహించిన అనంతరం స్విచ్ ఆన్‌చేసి నది నీటిని చింతమానుపల్లె ఎత్తిపోతల పథకానికి మళ్లించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ విద్యాసాగర్, ఏఈ పరమేష్, ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆయా కాలువ సాగునీటి సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

పాణ్యం: వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పాణ్యంలోని చెంచుకాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి మొత్తం 171గృహాలు మంజూరు కాగా వీటిలో 58 నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అలాగే మిగిలిన వాటిని కూడా ప్రారంభించి పనులు చేపట్టాలన్నారు. అనంతరం నిర్మాణాలను పరిశీలించారు. చెంచులకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

కల్లూరు: రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించి వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం



పిల్లలతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఉపాధ్యాయులు

ఓర్వకల్లు: పాఠశాల విద్యార్థులకు నిర్వహించే క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని ఇన్‌చార్జి హెచ్‌ఎం మద్దిలేటి అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ, పాఠశాల విద్యలో భాగంగా ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు స్పోర్ట్స్‌కు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రగతి ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో క్రీడా పరికరాలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం పిల్లలతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు అనిత, హన్నాసైమన్, లలితకుమారి, కళావతి, రాజీవ్‌కుమారి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం: డీఆర్‌డీఏకు సంబంధించి 29మండలాల ఏపీఎం, ఎల్‌సీలకు శుక్రవారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. మండల కేంద్రం పాణ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యంగా 14 అంశాలతో కూడిన సమీక్ష చేశామన్నారు. సంస్థాగత నిర్మాణం, లోకోస్‌యాప్ అప్డేట్, స్వయం సహాయక సంఘ సభ్యురాళ్ల ఫేస్ రికగ్నైజడ్, మొబైల్ బుక్ కీపింగ్ 2.0, స్వయం సహాయక సంఘం సమావేశ స్థలం జియోట్యాగింగ్, మన డబ్బులు–మన లెక్కలు, స్త్రీశక్తి యాప్, గ్రామ సంఘాలు, మండల సమైఖ్యల ఆడిటింగ్, ఈజీమార్ట్, జిల్లా టార్గెట్ 200, మైక్రో క్రెడిట్ ప్లాన్, ఉమెన్ ఎన్‌పవర్, స్త్రీనిధి రుణాల రికవరీ తదితరవి వందశాతం చేయాలన్నారు. వీటిపై ఈనెల 31 నాటికి పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ హనుమాన్‌నాయక్, డీపీఎం సీబీఓ రంగారావు, లైవ్‌ఉడ్ సుధాకర్, ఏరియా కో–ఆర్డినేటర్ ప్రసాద్, ఎల్లయ్య, శివచెన్ననాయుడు, ప్రసాద్ ఎల్‌సీలు పాల్గొన్నారు.

27న నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ సాయంత్రం 7 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో సాంఘిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా తెలిపారు. 7 గంటలకు షాద్‌నగర్ సంస్కార భారతి వారిచే సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య దర్శకత్వం వహించిన 'మాకు స్వాతంత్ర్యం కావాలి' లఘునాటిక, రాత్రి 7.30 గంటలకు డి.మహేంద్ర దర్శ కత్వం వహించిన 'వర్క్ ఫ్రం హోమ్' హాస్య నాటక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమ కన్వీనర్‌గా వి.రాముడు వ్యవహరిస్తారని తెలిపారు.



సి.బెళగల్‌లో ప్రధాన రోడ్డుపై నీటి మడుగు



కంబదహాల్ వద్ద మెయిన్ రోడ్డు దుస్థితి

ఇవేనా మెరిసే రోడ్లు?

- అడుగడుగునా గోతులతో వాహనదారుల అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సి.బెళగల్ ఎస్సీ కాలనీ వద్ద ప్రధాన రోడ్డుపై గోతుల్లో నిలిచిన వర్షపు నీరు



అవస్థలు పడుతున్న వాహనదారులు

సి.బెళగల్: తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగు చేస్తామని చెప్పిన కూటమి నాయకులకు సి.బెళగల్ మండలంలోని రోడ్లన్నీ కనిపించలేదోమో?. మండలంలోని రోడ్లు అడుగుకో గుంత చందంగా మారి ప్రయాణికులకు చుక్కలు చూపుతుండటంతోపాటు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ప్రధాన రోడ్లు మడుగులను తలపిస్తూ, ఇటు వాహనదారులను, అటు ప్రయాణికులను తీవ్ర అవస్థలకు గురిచేస్తున్నాయి. సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మోడల్ స్కూల్ వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్డు ధ్వంసమై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. మండల కాంప్లెక్స్ వద్ద రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. కనీసం ప్రజలు తిరిగేందుకు సైతం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఎస్సీ కాలనీ వద్ద మెయిన్ రోడ్డుపై దాదాపు 10 భారీ గోతులతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అదేవిధంగా బస్టాండ్ సమీపంలోని పాత వైన్‌షాప్ వద్ద భారీ గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. అదేవిధంగా కంబదహాల్ ప్రవేశం వద్ద సైతం రెండు లోతైన గోతులతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో నిత్యం స్కూటరిస్టులు, ఆటోలు బోల్తా పడి ప్రయాణికులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రధాన రోడ్డు దుస్థితిపై పలు మార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల వద్ద దెబ్బతిన్న ప్రధాన రోడ్డును బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు అధ్వానం

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు గ్రామంలోని దళిత కాలనీలో రోడ్లు దెబ్బతిని అధ్వానంగా మారాయి. చిన్ని పాటి వర్షానికే నీరు రోడ్డుపై చేరి ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్డుపై నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. అలాగే గ్రామం నుంచి జగనన్న కాలనీకి వెళ్లాలంటే మట్టి రోడ్డుండడంతో కాలనీ వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారినట్లు తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు వాపోయారు. కాలనీ చుట్టు బురద, నీళ్లు ఉన్నందున పాములు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



దెబ్బతిన్న రహదారి

పౌష్టికాహారం తీసుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి రఘు

కల్లూరు: గర్భిణిలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వామసముద్రం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని నోడల్ అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, చేపలు, మాంసము తగిన మోతాదులో తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు తప్ప మరే ఆహార పదార్థాలు ఇవ్వకూడదన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయని, శ్వాసకోస, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధులు నుంచి పిల్లలను రక్షిస్తాయన్నారు. అలాగే బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయన్నారు. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిస్సి గ్రేస్, ఆరోగ్య అధికారి విజయ్‌కుమార్, సామాజిక ఆరోగ్య అధికారి మాబున్ని, ఆరోగ్య కార్యకర్త నాగమ్మ, ఆశా, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం.. ఆందోళనలో అన్నదాతలు



గడివేములలో పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు



వర్షపు నీటిలో మొక్కజొన్న పంట

గడివేముల: గత ఐదు రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు దెబ్బతింటున్నాయి. మండలంలో మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, మినుము పంటలు అధికంగా సాగు చేశారు. వర్షం వస్తుండటంతో పంటల్లో కలుపులు తీసుకునేందుకు వీలు లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రైతు సేవాకేంద్రాల్లో యూరియా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు.

ఆర్‌యూ వీసీని రీకాల్ చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావును రీకాల్ చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రాఘవేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 24వ తేదీన వర్సిటీ పాలక మండలి సమావేశాన్ని ఎందుకు గోప్యంగా జరిపారని ప్రశ్నించారు. వీసీ ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తూ ప్రొఫెసర్లు, ఉద్యోగులకు ఎలాంటి సమాచారం లేకుండా సమావేశం నిర్వహించడంలో ఆంతర్యమేంటన్నారు. వర్సిటీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. వీసీ నిర్ణయాలతో రోజుకో వివాదం ఉత్పన్నమై వర్సిటీలో అలజడులు చెలరేగుతున్నాయని పేర్కొన్నారు. వర్సిటీ అభివృద్ధికి పాటు పడేవారైతే ఎందుకు వర్సిటీ ఏడీ బిల్డింగ్‌ను మూయించి రహస్యంగా ఈసీ మీటింగ్ జరుపుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈసీ మీటింగ్‌లో చేసిన తీర్మానాలను గతంలో వర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టేవారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత వీసీ ఈసీ మీటింగ్ జరిపి రెండు రోజులవుతున్నా ఈసీ మీటింగ్ మినిట్స్ బహిర్గతం చేయలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. వర్సిటీని భ్రష్టు పట్టిస్తూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న వీసీని వెంటనే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు.

27న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 27న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్ తీసుకు రావాలని సూచించారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న అంతర్ జిల్లా సీనియర్స్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 90309 00569 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పార్టీలో కష్టపడే వారికే పదవులు



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న సి.బెళగల్ మండల నాయకులు

సి.బెళగల్: గ్రామాల్లో పార్టీ కోసం కష్టపడే వారికే సముచిత స్థానం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోలకల్ గ్రామానికి చెందిన బొజ్జన్న వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా, నాగేష్ వైఎస్సార్‌సీపీ మండల ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో వారు శుక్రవారం మండల, గ్రామ నాయకులతో కలిసి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పార్టీ పదవులు పొందిన వారు కార్యవర్గ సభ్యులు సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్థలాల ఆక్రమణపై ఆర్డీఓ విచారణ



స్థలాల ఆక్రమణపై విచారణ చేస్తున్న ఆర్డీఓ సందీప్

సి.బెళగల్: మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కర్నూలు ఆర్డీఓ సందీప్ విచారణ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి చేరుకున్న ఆయన ఆక్రమణ స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించిన ఆయన రోడ్డుపై ఉన్న బంకులను తొలగించాని, పాఠశాల వెనుక భాగంలో ఉన్న గుడిసెలను తొలగించి, ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి పరిస్థితిపై విచారించి, ఇళ్ల స్థలాలకు అర్హులైతే స్థలాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ గోవిందు, వీఆర్వోలు రఫి, తిమ్మన్న, రంగముని, వీఆర్‌ఏలు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆర్డీఓ, అధికారులు

సి.బెళగల్‌లో ఆక్రమణలపై విచారణకు వచ్చిన ఆర్డీఓ సందీప్, మండల అధికారులతో కలిసి క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, స్వామివారి విశిష్టతను, కొండపై జరిగే పూజా కార్యక్రమాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మ, ఆర్‌ఐ తరుణ్, ఎంఈఓ ఆదామ్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ సంపత్‌కుమార్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నిడ్జూరు గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ సంపత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామస్తులతో కలిసి కర్నూలు మండల విద్యుత్ కార్యాలయంలో ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. గ్రామంలో చాలా చోట్ల విద్యుత్ తీగలు అతుకులు వేశారన్నారు. వాటిని తొలగించి కొత్త విద్యుత్ తీగలతో లైన్ ఎర్పాటు చేయాలన్నారు. గ్రామంలో కొన్ని చోట్ల పాత విద్యుత్ స్తంభాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయలని కోరారు. ప్రధాన వీధిలో పాత స్తంభాలను తొలగించకుండానే కొత్తవి ఏర్పాటు చేశారని, పాతవి కూలిపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. గ్రామంలో వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని చెప్పారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఈ హామీ ఇచ్చారు.

'తొలి అడుగు'లో సమస్యల ఏకరువు

కర్నూలు(రూలర్): మండల పరిధిలోని ఇ.తాండ్రపాడులో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే బి.దస్తగిరికి గ్రామ సర్పంచ్ బాలపీర, సీపీఎం నాయకులు గ్రామ సమస్యలు పరిష్కరించాలని అర్జీ అందజేశారు. గ్రామంలో ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్యలను పరిష్కరించాలని, రజకులకు దోబీ ఘాట్లు నిర్మించాలని, తాగు నీటి సమస్య పరిష్కారానికి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను ఎర్పాటు చేయాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో 11 కేవీ విద్యుత్ వైర్లు ఇళ్లపై నుంచి వెళ్లడం వల్ల కాలనీవాసులు ప్రమాదాలకు గురౌతున్నారని, వాటిని తక్షణమే మరో చోటికి మార్చాలని కోరారు. కాలనీల్లో మహిళలకు సామూహిక మరుగుదొడ్డు నిర్మించాలన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో జీవాలను నిలుపుకునేందుకు గ్రామ సరిహద్దులో షెడ్లు నిర్మించాలని కోరారు. అలాగే వితంతువులు, వృద్దులకు పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు పి.ఉసేనయ్య, వెంకటస్వామి, కె.నాగేష్, గ్రామస్తులు ఉన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: పీ – 4 సర్వేలో భాగంగా ఆయా గ్రామాల్లో రూపొందించిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునఃపరిశీలించి, కుటు ంబాల ఎంపికను అత్యంత పారదర్శకంగా గుర్తించాలని ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ నాగరాజు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాముడు పీ – 4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో గుర్తించిన బంగారు కుటుంబాలను మరో పునఃపరిశీలించి నిజమైన కుటుంబాలను గుర్తించడంతో పాటు, ఆ గ్రామంలో ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న వారిని గుర్తించి బంగారు కుటుంబాలకు అనుసంధానం చేయాలన్నారు. ఈ ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, మండల ఇంజినీర్ గంగరాజు, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష!

- వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- నాణ్యమైన దిగుబడులకు ఆస్కారం వ్యవసాయ శాఖ సూచన

బూజునూరు గ్రామ సమీపంలో సాగు చేసిన వరి నారుమడి



గడివేముల: వరినారుపోసే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారు, దిగుబడిని పొందవచ్చు. నారుమడి యాజమాన్య పద్ధతులను వ్యవసాయాధికారులు ఇలా సూచిస్తున్నారు. మండలంలో దాదాపు ఈ సీజన్‌లో 8 వేల ఎకరాల దాకా వరి సాగు చేస్తారు.

నారుమడి తయారీ ఇలా..

దమ్ము చేసిన నేలలో 10 మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమంగా, గట్టిగా పోయాలి. మడిలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసి నారుమడిని ఎత్తుగా చదునుగా ఉండాలే చూసుకోవాలి. నారుమడి 10 నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేసు కోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విప్పుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉం డే ప్రాంతాల్లోనే జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొనలు విరిచి నాటాలి. దీంతో గుడ్లను నిర్మూలించవచ్చు.

విత్తన మోతాదు..

నాటే పద్ధతికి 20 నుంచి 25 కిలోలు వెదజల్లడానికి విత్తనాలను వినియోగించవచ్చు. సాధారణ భూముల్లో 24 నుంచి 30 కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16నుంచి 30కిలోలు సరిపో తాయి. విత్తడానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30నుంచి 36కిలోల అవసరం ఉంటుంది.

సస్యరక్షణ ఇలా..

విత్తిన 10రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 ముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిఫైరిఫాస్ 2.0 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి విత్తనాలపై 10రోజుల నుంచి 17రోజుల వరకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయడానికి వారం రోజులముందు సెంటు నారుమడికి 160గ్రాముల కార్బో ఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

విత్తన శుద్ధి ఇలా..

కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్ కలిపి 24గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టాలి. మరో 24 గంటల పాటు మండికట్టి మొలకలను దంప నారుమడిలో చల్లు కోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొల గించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచి నీటిలో విత్త నాలను నానబెట్టాలి. వీటి ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు. మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిఫైరీపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు ఆశించకుండా ఉంటాయి.

యాజమాన్యం ఇలా..

నారుమడులు పోయాలనుకున్న భూములకు వేసవి దుక్కుకు ముందుగానే పశువుల ఎరువు వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్తపడాలి. 5సెంట్ల నారుమడికి 25 కిలోల నత్రజనిని ఒక కిలో విత్తనం చల్లే ముందు ,మరో కిలో విత్తిన 12వ నుంచి 14రోజులకు ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చని వివరించారు.